
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 25.716 టీఎంసీలు

సోమశిల: సోమశిలలో 25.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువ, కావలి కాలువలకు 3,050 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,830
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,822
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,997
నవర (8 గ్రాములు)	రూ.47,976

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.6 /21.8

బుధవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంది. గురువారం ఎలాంటి మార్పులు ఉండవని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

రీజినల్ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం, కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజినల్ కో ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన బుధవారం వెలువడింది. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి అదనంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించామని ప్రకటనలో పేర్కొన్నారు.

ఈఎస్ బాధ్యతల స్వీకరణ



బాబు శ్రీధర్

నెల్లూరు(క్రైమ్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) జిల్లా ఈఎస్‌గా బాబు శ్రీధర్ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్ ప్రకాశం జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిత్తూరులో పనిచేస్తున్న బాబు శ్రీధర్‌ను నియమించారు. ఎక్సైజ్ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ 1996లో విధుల్లో చేరారు. కర్నూలు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేశారు. నూతన ఈఎస్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లాకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలో ఏపీఐఐసీలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును పదోన్నతిపై రాపూరు తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ వినియోగదారుల ఫోరమ్ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పద్మావతిని జిల్లా సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పటిష్టంగా భూముల రీ సర్వే



మాట్లాడుతున్న హనుమాన్‌ప్రసాద్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి అన్నవరపు హనుమాన్‌ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో జిల్లాలోని సర్వే అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 711 గ్రామాలకు గానూ రీ సర్వే ప్రక్రియ చాలా వరకు పూర్తయిందని చెప్పారు. సంబంధిత రైతులతో సమష్టిగా సర్వే నిర్వహించి, హద్దుల ఏర్పాటులో అవకతవకల్లేకుండా చూడాలని సూచించారు. అనంతరం రీ సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు.

సీఈ హరినారాయణరెడ్డికి సన్మానం



నెల్లూరు రూరల్: ఉద్యోగ విరమణ పొందిన తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డికి సత్కార కార్యక్రమాన్ని నెల్లూరులోని కనుపర్తిపాడులో గల వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఒంగోలు చీఫ్ ఇంజినీర్ మురళీనాథ్‌రెడ్డి హాజరై హరినారాయణరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం హరినారాయణరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. తెలుగుగంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కృష్ణమోహన్, సోమశిల సర్కిల్ ఎస్ఈ రమణారెడ్డి, తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకట్రామయ్య, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడులు.. భలేగున్నాయ్

సుందరంగా మారిన పొదలకూరులోని డీఎన్నార్ ప్రభుత్వ పాఠశాల





- పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య
- నాడు – నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- ప్రతి స్కూల్లో తొమ్మిది రకాల మౌలిక వసతులు

జిల్లాలో ఇదీ తీరు..

ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
3,433	3,52,460

మొదటి దశలో కేటాయించిన మొత్తం - 861 స్కూళ్ల అభివృద్ధికి రూ.160.70 కోట్లు

రెండో దశలో - 1356 బడులకు రూ.466.72 కోట్లు

పెచ్చులూడే పైకప్పులు.. అధ్వానంగా ఉండే గదులు.. అరకొర వసతుల నడుమ గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల చదువులు అంతంత మాత్రంగానే సాగేవి. ఫలితంగా పేదలు ఆర్థిక స్తోమతకు మించి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేవారు. ఈ తరుణంలో 2019లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సకల సౌకర్యాలను కల్పిస్తుండటంతో సర్కారీ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.



అత్యాధునికంగా తీర్చిదిద్దిన మరుగుదొడ్లు

మనుబోలు: విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసిన ప్రభుత్వం సర్కారీ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణలో భాగంగా అదనపు గదుల నిర్మాణం.. దెబ్బతిన్న గదులకు మరమ్మతులు.. నిరంతర నీటి సరఫరాతో పరిశుభ్రమైన టాయ్‌లెట్లు.. తాగునీటి సరఫరా.. ఇంగ్లిష్ ల్యాబ్‌లు.. విద్యార్థులు, ఉపాధ్యాయులకు నాణ్యమైన ఫర్నిచర్.. ప్రతి తరగతి గదిలో గ్రీన్ చాక్ బోర్డు.. ఫ్యాన్లు.. ట్యూబ్‌లైట్లు.. వంట గది.. ప్రహరీ నిర్మాణం.. గోడలకు ఆకర్షణీయమైన రంగులు.. ఇలా ఎన్నో వసతులను ఏర్పాటు చేశారు.

ఇంగ్లిష్ మీడియంలో చదువు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. నాణ్యమైన బూట్లు.. బ్యాగులు.. యూనిఫారం, పుస్తకాలను అందజేస్తున్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.



మనుబోలులోని సీఎంనగర్ ప్రాథమిక పాఠశాలలో టీవీ ద్వారా చిన్నారులకు బోధన

పనుల పురోగతి ఇలా..

- మనబడి నాడు–నేడులో భాగంగా మొదటి దశలో జిల్లాలోని 861 పాఠశాలల్లో రూ.160.70 కోట్లతో 6256 ఆధునీకీకరణ పనులను పూర్తి చేశారు.
- రెండో దశలో జిల్లాలోని 1356 పాఠశాలల్లో రూ.466.72 కోట్ల అంచనా వ్యయంతో 8490 పనులు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటి వరకు 1381 పనులను పూర్తి చేయగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి.

కొత్తగా.. కొంగొత్తగా..

- నేలపై కూర్చునే బాధ నుంచి విద్యార్థులకు విముక్తి కల్పించి నాణ్యమైన బెంచీలను ఏర్పాటు చేశారు.
- జగనన్న గోరుముద్ద పేరుతో రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రోజుకో మెనూను అమలు చేస్తూ వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావను పంపిణీ చేస్తున్నారు.
- జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్స్, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్‌బుక్స్, యూనిఫారం, బెల్టును అందజేస్తున్నారు.
- తరగతి గదుల్లో టీవీలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసి డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ట్యాబ్‌లతో ఎంతో ఉపయోగం



ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. చదువే కాకుండా జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన ఏ విషయాన్నైనా తెలుసుకోగలుగుతున్నాం. జగన్ మామయ్య మేలును మర్చిపోలేం.
– మౌనిక, తొమ్మిదో తరగతి

గతంలో ఏ ప్రభుత్వం ఇలా చేయలేదు



నా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో 8, 9వ తరగతులు చదువుతున్నారు. అమ్మఒడి పేరుతో నగదును ఏటా జమ చేస్తున్నారు. యూనిఫారం నుంచి ట్యాబ్‌ల వరకు అన్నింటినీ ఉచితంగా సమకూరుస్తున్నారు. పిల్లల విషయంలో ఏ దిగులూ లేదు. జగనన్న కారణంగా కుటుంబమంతా ఆనందంగా ఉంది.
– మొలకల విజయ, విద్యార్థి తల్లి, సీఎంనగర్, మనుబోలు

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా వసతులను ప్రభుత్వం కల్పించింది. నాడు–నేడు ద్వారా పాఠశాలలకు మరమ్మతులు చేయడమే కాకుండా అవసరమైన చోట అదనపు గదులను నిర్మించారు. విద్యార్థులకు అవసరమైన వాటిని ఉచితంగా సమకూరుస్తున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలి. – శేషాద్రివాసు, ఎంఈఓ

బీఎల్ఏలను పార్టీలు నియమించుకోవాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని తన చాంబర్‌లో కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని పార్టీలే బీఎల్ఏలను నియమించాయని, మిగిలిన వారూ పూర్తి స్థాయిలో నియమించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ప్రతి వారం నిర్వహించి, వారు కోరిన సమాచారాన్ని ఇస్తున్నామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. తుది ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫారం – 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. అన్ని నియోజకవర్గాల్లో ఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారని చెప్పారు. డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మురళీధర్‌రెడ్డి, టీడీపీ నుంచి రసూల్, బీజేపీ తరఫున శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్స్ డీఎంగా లక్ష్మీనరసింహారావు

నెల్లూరు (పొగతోట): పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా లక్ష్మీనరసింహారావును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. డీఎంగా పనిచేసిన నరసింహారావు ఉద్యోగ విరమణ పొందడంతో లక్ష్మీనరసింహారావును నియమించారు.

3.22 లక్షల మందికి పింఛన్లు

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 3,22,256 మంది లబ్ధిదారులకు రూ.95.67 కోట్లను పంపిణీ చేయనున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే నగదు పంపిణీకి వలంటీర్లు శ్రీకారం చుట్టనున్నారు. అవ్వాతాతల ఇంటి తలుపులు తట్టి వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేయనున్నారు.

బడి బయట పిల్లలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కోవూరు: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కోవూరులోని ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవూరు మండలంలో డ్రాపౌట్స్‌ను గుర్తించి బడిలో చేర్పించేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, మహిళా పోలీస్ ఒక కమిటీగా ఏర్పాటై చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్స్‌కు సంబంధించిన రిజిస్టర్‌ను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసి, ఈ నివేదికను నెలకోసారి విద్యావనరుల కేంద్రానికి పంపాలని సూచించారు. ఎంఈఓ – 2 చెంచులక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సాంత్వన

- బిడ్డ అనారోగ్యంతో తల్లడిల్లిన కుటుంబం
- రూ.10 వేల పింఛన్‌తో ప్రభుత్వ భరోసా



కోవూరు: ఇద్దరమ్మాయిలు.. ఒక అబ్బాయితో ఆ కుటుంబం ఉన్నంతలో హాయిగా జీవనం సాగించేది. ఇంతలో ఉపద్రవం వచ్చిపడింది. కుమారుడికి లుకేమియా (బ్లడ్ కేన్సర్) బయటపడటంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. కోవూరు మండలం పడుగుపాడు ఎస్సీ కాలనీకి చెందిన మైలారి మల్లికార్జున్‌కు భార్య రెబెకా, పిల్లలు షారన్‌రోజ్ (తొమ్మిదో తరగతి), స్వప్నా జాస్మిన్ (ఏడో తరగతి), శ్యామ్ (ఐదో తరగతి) ఉన్నారు. శ్యామ్‌కు ఆరోగ్య సమస్య రావడంతో ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్న తండ్రి మల్లికార్జున్ కన్నీరుమున్నీరయ్యారు. ఇదే సమయంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడటంతో అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడ్ని ఆదుకొని ప్రతి నెలా రూ.పది వేల పింఛన్‌ను అందజేస్తున్నారు. అమ్మఒడి ద్వారా తల్లి బ్యాంక్ ఖాతాలో ఏడాదికి రూ.13 వేలు.. వాహనమిత్ర ద్వారా మల్లికార్జున్‌కు రూ.10 వేలు అందుతున్నాయి. ఇటీవల మల్లికార్జున్ కుటుంబానికి జగనన్న కాలనీలో ఇంటి నివేశన స్థలం మంజూరైంది. ఆయన భార్య రెబెకాకు ఆసరా నగదును ప్రభుత్వం అందించింది.



భార్య, పిల్లలతో మైలారి మల్లికార్జున్

జగనన్నకు రుణపడి ఉంటాం

సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం రుణపడి ఉంటుంది. మా బాబు శ్యామ్‌కు తీవ్ర అనారోగ్యం వస్తే ప్రభుత్వమే ఆదుకుంది. ప్రతి నెలా రూ.పది వేల పింఛన్‌ను ఇంటికి పంపుతున్నారు. ఈ నగదు మందులకు ఎంతో ఉపయోగపడుతోంది. చాలీచాలని ఆదాయంతో ముగ్గురు పిల్లలను పోషించడం కష్టంగా ఉన్న సమయంలో జగనన్న దేవుడిలా ఆదుకుంటున్నారు.
– మైలారి మల్లికార్జున్, ఆటో డ్రైవర్

నిఘా నీడన..

- ఎన్నికల తరుణంలో జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- బైండోవర్ల ప్రక్రియ దాదాపు పూర్తి
- మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట



వాహన తనిఖీలను నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలను నిర్వహిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ముందస్తు చర్యలు చేపట్టారు. రెండు నెలల ముందే జిల్లాలో ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసి గత ఎన్నికల కేసులు, బైండోవర్లు, నగదు, మద్యం, ఇతర వస్తువుల సీజ్, ఆయుధాల డిపాజిట్లు తదితర వివరాలను సేకరించారు. జిల్లాలోని రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితుల బైండోవర్ల ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. వీరి కదలికలపై నిఘా ఉంచారు. పెండింగ్‌లో ఉన్న 389 నాన్‌బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేశారు. సమాచార వ్యవస్థను పటిష్టపర్చేందుకు గానూ గ్రామ సందర్శిని పేరుతో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, వార్డులను సందర్శిస్తూ అక్కడి ప్రజలతో మమేకమవుతున్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లపై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

నిరంతర తనిఖీలు

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపర్చేందుకు మద్యం, నగదును భారీగా పంపిణీ చేసే అవకాశం ఉండటంతో వీటి కట్టడికి చర్యలు చేపట్టారు. వెంకటాచలం, బుచ్చిరెడ్డిపాళెం, మునునూరు, డీసీపల్లి టోల్‌ప్లాజాలు, మద్దెలమడుగు జంక్షన్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి పగలు, రాత్రనే తేడాలేకుండా వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. బిల్లుల్లేకుండా తరలిస్తున్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు, అనధికార మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. మరోవైపు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

నెల వ్యవధిలో..

- జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. బిల్లుల్లేకుండా నగదు తరలింపుపై 119 కేసులు నమోదు చేసి రూ.35,30,530ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసులను ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.
- ఎలాంటి బిల్లుల్లేకుండా తరలిస్తున్న రూ.17.52 లక్షల విలువజేసే 26.537 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.
- మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై దాడులు చేసి రూ.10,53,265 విలువజేసే 1681 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు.
- పొరుగు మద్యం అక్రమ రవాణాపై దాడులు చేసి రూ.45,973 విలువజేసే 40.56 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను కటకటాల వెనక్కి పంపారు.
- సారా తయారీ, విక్రయాలపై దాడులు చేసి 212 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని.. 25,890 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.



వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలతో పోలీసులు (ఫైల్)



వార్డు సందర్శనలో భాగంగా..

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ప్రశాంత ఎన్నికలే ముందున్న లక్ష్యం. దీనికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలి. మద్యం అక్రమ రవాణా, అనధికార నిల్వలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, తదితరాలు జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతాం.
– తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

పొదుపు మహిళలకు తోడ్పాటు

నెల్లూరు(బారకాసు): పట్టణ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన తోడ్పాటు సత్ఫలితాలను ఇస్తోందని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. నెల్లూరు పట్టణ సమాఖ్య – 3 ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట, కరెంటాఫీస్ సెంటర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మెషినరీని బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణ పొదుపు సంఘ సభ్యులకు జీవనోపాధి కల్పించడంలో మెప్మా ఎప్పుడూ ముందుంటుందన్నారు. మెప్మా సిబ్బంది ఎల్‌హెచ్ సుధాకర్, సీఎంఎం జరీనా, సీఓలు మహేంద్ర, హైమావతి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు భార్గవి, హరిత, సాధన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎంబ్రాయిడరీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర

వైఎస్సార్ ఆసరాతో పేదింట వెలుగులు



పొదుపు మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: వైఎస్సార్ ఆసరాతో పొదుపు మహిళలకు బాసటగా నిలిచి పేదింట వెలుగులు నింపిన ఏకైక సీఎం మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో బుధవారం జరిగిన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు పొదుపు రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చి మోసం చేశారని చెప్పారు. అందువల్లే మహిళల ఆశీర్వాదం జగనన్నకే ఉందన్నారు. బాబుకు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదని చెప్పారు. వచ్చే ఎన్నికలు పేదలు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నట్లు తెలిపారు. పేదలు సీఎం జగన్ పక్షాన ఉంటే.. పెత్తందార్లు చంద్రబాబు పక్షాన ఉన్నారని తెలిపారు. నా ద్వారా మేలు జరిగి ఉంటేనే ఓటు వేయమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతుంటే బాబు మాత్రం డబ్బులిచ్చి ఓట్లు కొనాలని వస్తున్నారని చెప్పారు. షర్మిల కాంగ్రెస్‌తో చేతులు కలిపి సొంత అన్నపై విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. కాంగ్రెస్‌కు ఈ రాష్ట్రంలో ఒక్క సీటు కూడా రాదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్, డీఏఏబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ జి.విజయకుమార్, జెట్పీటీసీ పి.సరోజనమ్మ, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్‌లు జి.వెంకటశేషయ్య, బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎం.సుప్రజ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ ఆదాల, చైర్‌పర్సన్ అరుణమ్మ

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అటు రాజకీయపరంగా 50 శాతం పదవులు కేటాయించి ప్రత్యేక గుర్తింపునిచ్చింది' అని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలానికి సంబంధించిన ఆసరా సంబరాలను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారన్నారు. గతంలో సమావేశాలకు మహిళలు తక్కువ సంఖ్యలో వచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. మహిళల్లో చైతన్యం వచ్చిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సమాజంలో అన్ని రకాల అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా సీఎం జగన్ పేద ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లురెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వంలో కూడా చేయనంత మంచి సీఎం జగన్ పాలనలో జరిగిందన్నారు. పథకాల వల్ల ప్రతి కుటుంబం కనీసం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి పొందినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రానికి మంచి చేసే వారికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. మండలానికి నాలుగో విడత కింద 857 గ్రూపులకు రూ.3 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆడుదాం ఆంధ్రాలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు రూ.70 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, గాజుల తాజుద్దీన్, మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి, పాముల రమణయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్ల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 43 మంది తహసీల్దార్లను గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాలకు బదిలీ చేస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు ఇక్కడికి ఆ జిల్లాల నుంచి 30 మంది రానున్నారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ వారికి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఆర్.బ్రహ్మయ్య, టి.శ్రీనివాసులు, ఎండీ హుస్సేన్, రామ్మోహన్‌రావు, పి.హేమంత్‌కుమార్, కె.చంద్రశేఖర్, డి.శ్రీరామకృష్ణ, ఏవీ రమణరావు, వై.నాగరాజు, లక్ష్మీనరసింహం, సీహెచ్ రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎం.సుధాకర్‌రావు, ఎ.నిర్మలానందబాబా, సీహెచ్ సుబ్బయ్య, ఎం.పద్మజ, లావణ్య, వి.సుధీర్, బి.సోమ్లానాయక్, లీలారాణి, ఎ.పద్మావతి, బి.పద్మావతి, మునిలక్ష్మి, మస్తానయ్య, బీఆర్‌కే శివప్రసాద్, రవికుమార్, జయరావ్, ఎస్.రామయ్య, రాజ్యలక్ష్మి, సూర్యనారాయణ సింగ్, కె.సుందరమ్మ, షేక్ షఫీమాలిక్, విజయ్‌కుమార్, రాఘవేంద్రరావు, శ్యామలమ్మ, పి.విజయ్‌కుమార్, సుభద్ర, అనూరాధ, గీతావాణి, ఎస్.శ్రీనివాసులు, శాంతకుమారి, స్ఫూర్తి ఇతర జిల్లాకు బదిలీ అయిన వారిలో ఉన్నారు.

ఆర్‌ఐలు..

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్‌ఐలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లాలో ముగ్గురు ఆర్‌ఐలు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి నలుగురు ఇక్కడికి వస్తున్నారు. బదిలీ అయిన వారు ఆయా ప్రాంతాల్లో వెంటనే రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డి.శ్రీనివాసరెడ్డి నెల్లూరు నుంచి బాపట్లకు, షేక్ మౌలుద్దీన్ నెల్లూరు నుంచి బాపట్లకు వై.పాల్‌రాజు నెల్లూరు నుంచి తూర్పుగోదావరికి, కె.హరిబాబు సీఎస్‌డబ్ల్యూ విజయవాడ నుంచి నెల్లూరుకు, జె.రాజారావు గుంటూరు నుంచి నెల్లూరుకు, కె.థామస్‌రెడ్డి గుంటూరు నుంచి నెల్లూరుకు, కె.నాగరాజు సీఏఆర్ విజయవాడ నుంచి నెల్లూరుకు బదిలీ అయ్యారు.

3న హాకీ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 3వ తేదీన హాకీ జిల్లా జూనియర్ మహిళ, సబ్ జూనియర్ బాలుర జట్ల ఎంపికలు జరుగుతాయని హాకీ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్‌మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన మహిళా జట్టు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. బాలుర జట్టు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇతర వివరాలకు డైరెక్టర్ పి.థామస్ పీటర్ ఫోన్ నంబర్ 94404 66189ను సంప్రదించాలన్నారు.

రూ.23 కోట్లతో రోడ్ల పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలో రూ.23 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలి మండలం తాళ్లపాళెం రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అయితే టీడీపీ, ఎల్లో మీడియా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విష ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. చివరికి తన కుటుంబసభ్యులపై కూడా తప్పుడు ప్రచారానికి దిగారని, భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజల ఆశీస్సులు తనపై ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రతి గ్రామంలోని మహిళలు చెబుతారన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా నిజాలను దాచేందుకు చేస్తున్న కుట్రలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కావలి – తుమ్మలపెంట రోడ్డుపై ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా సొంత నిధులతో పనులు చేయిస్తానన్నారు. పట్టణంలోని మందాటి చెరువు పక్కన ఉన్న గుంటలో నాయీ బ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు త్యాగరాజ భవనం, భవన నిర్మాణ కార్మికుల బిల్డింగ్‌ల నిర్మాణానికి స్థలం మంజూరు చేసినట్లు చెప్పారు. పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, ఆముదాలదిన్నె సర్పంచ్ ఉడా బ్రహ్మానందం, మాజీ జెట్పీటీసీ సభ్యుడు కందుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బిల్లుపాడులో బుధవారం విజయీభవ యాత్రను ఎమ్మెల్యే నిర్వహించారు. ఆయన గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం నూతనంగా నిర్మించిన సైడ్ కాలువను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామంలో ఇప్పటి వరకు రూ.16 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. వివిధ పథకాల ద్వారా రూ.3.50 కోట్లను అందజేశామన్నారు. రెవెన్యూ సమన్వయ కమిటీ సహకారంతో గ్రామంలో 97 మంది రైతుల సమస్యలు పరిష్కారమైనట్లు వెల్లడించారు. ఎన్‌డీఆర్ నిధుల కింద రూ.30 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతి నాయుడు, జేసీఎస్ కన్వీనర్ పి.బాలంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగార్జున, మస్తాన్‌రెడ్డి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారు సరుడు దోపిడీ



ఆదెమ్మ

పొదలకూరు: వృద్ధురాలి మెడలోని బంగారు సరుడు లాక్కెళ్లిన ఘటన పట్టణంలోని తొగటివీధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తొగటివీధిలో ఆదెమ్మ నివాసం ఉంటున్నారు. ఇంటి ముందు ఆమె చిన్నపాటి బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గుర్తుతెలియని యువకుడు రెండురోజులుగా ఆ బంకు వద్దకు వచ్చి మాటలు కలుపుతూ సిగరెట్లు కొనుగోలు చేసి తాగేవాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వీధిలో రాకపోకలు లేవని నిర్ధారించుకున్నాక అతను ఒక్కసారిగా ఆదెమ్మ మెడలో ఉన్న 3 సవర్ల బంగారు సరుడు లాక్కొని స్కూటీలో పరారయ్యాడు. వృద్ధురాలు అతడిని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నంలో రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆమె గాయపడింది. సమాచారం అందుకున్న పొదలకూరు సీఐ ఆర్.రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీహెచ్‌సీ నుంచి ఆదెమ్మను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు జీజీహెచ్‌కు పంపారు. సీసీ టీవీ ఫుటేజీని సీఐ పరిశీలిస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 128
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 254
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.60
సన్నవి : రూ.50
పండ్లు : రూ.25

మృతదేహానికి పోస్టుమార్టం

సంగం: మండలంలోని తలుపూరుపాడులో మస్తాన్‌బీ (77) అనే వృద్ధురాలిని హత్య చేసి నగలు దోపిడీ చేసిన ఘటనలో బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మస్తాన్ సాహెబ్ అనే వ్యక్తికి తలుపూరుపాడు గ్రామానికి చెందిన అన్సర్ మద్యంలో మత్తు మందు కలిపి తాగించాడు. అనంతరం మస్తాన్ భార్య మస్తాన్‌బీని హత్య చేసి నగలు దోపిడీ చేశాడు. ఆమె గుండెపోటుతో చనిపోయిందని భావించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే అన్సర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో మంగళవారం మృతురాలి మనుమడు బాబు సంగం పోలీసులు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేపట్టి మస్తాన్‌బీ మృతదేహాన్ని వెలికి తీయించి తహసీల్దార్ నాగరాజు సమక్షంలో పోస్టుమార్టం చేయించారు. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై దృష్టి

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. సురక్ష-2, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, సచివాలయాల్లో రెవెన్యూ వసూళ్లు, కులగణన, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం నెల్లూరులోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఓపీ రిజిస్ట్రేషన్‌ను పెంచాలన్నారు. సురక్ష -1లో గుర్తించిన రెఫరల్ కేసులు, కంటి వెలుగుకు సంబంధించి క్యాటరాక్ట్ ఆపరేషన్లు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా అందరికీ అందించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై ఎంపీడీఓలు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ-కేవైసీ త్వరగా పూర్తి చేసి కార్డుల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. కులగణనను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. గత వారం 23 అర్జీలు పునరావృతమైనట్లు చెప్పారు. సాంకేతిక కారణాలతో ఆరు అర్జీలు మళ్లీ వచ్చాయన్నారు. అన్ని శాఖల అధికారులు అర్జీలను రోజూ పరిశీలించాలన్నారు. ఈనెల ఒకటి నుంచి అన్ని రేషన్ దుకాణాలకు బియ్యాన్ని సకాలంలో తరలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం సరుకులు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాక్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఎత్తు, బరువును నమోదు చేసే ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, హౌసింగ్ పీడీ నాగరాజు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, నుడా వీసీ బాపిరెడ్డి, మత్స్య, పశుసంవర్ధక శాఖ జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.